క్లుప్తంగా

అయ్యప్ప, భవానీలకు భిక్ష



కార్తీక సమారాధనలో పాల్గొన్న అయ్యప్ప, భవానీ భక్తులు

ఉంగుటూరు (నిడమర్రు): లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం గోపీనాథ పట్నం గ్రామంలో శ్రీలక్ష్మీనారాయణ అన్న సమారాధన సత్రం వద్ద అయ్యప్ప, భవానీ భక్తులకు కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పీఠాల నుంచి అయ్యప్ప, భవానీ మాలాధారులు హాజరై ప్రత్యేక పూజలు చేశారని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని చెప్పారు. ఈ సందర్భంగా గురు స్వాములను సత్కరించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బాసిరాజు, వాసు, రఘు తదితరులు సేవలందించారు.

విద్య, వైద్యరంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



సంక్షేమ కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్

పెదపాడు: విద్య, వైద్యరంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ అధికా ప్రాధాన్యనిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు గ్రామ సచివాలయం -2లో సోమవారం నిర్వహించిన పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తొలుత పార్టీ స్థూపాన్ని అవిష్కరించారు. గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ కర్రె మరియమ్మ, స్థానిక నాయకులు కొత్తూరు విమలారావు, బత్తుల ఏసురాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు అల్లు శ్రీనుకు అవార్డు



శ్రీనుకు అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

ఉంగుటూరు (నిడమర్రు): ఎక్స్‌రే సాహిత్యం సాంస్కృతిక సేవా సంస్థ, బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం ఉప్పాక స్కూల్ ఉపాధ్యాయుడు అల్లు శ్రీనుకు డాక్టర్ అబ్దుల్ కలామ్ ఎక్స్‌లెన్సీ అవార్డును ఎమ్మెల్యే మల్లాది విష్ణు అందించారు. ఆ సంస్థల సభ్యులు శ్రీనుని దుస్సాలువా, మెమెంటో, మెడల్ సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరించారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, సీనియర్ నటుడు శ్యాంమ్ సుందరం తదితరులు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: నిషేధిత కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని పెదపాడు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని నాయుడుగూడెం గ్రామం వైపు కోళ్ల వ్యర్థాలు వ్యానులో తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు పోలీసులు వాహనాన్ని వాటర్ ప్లాంట్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



గజ్జె పూజలో పాల్గొన్న రచయిత అనంత శ్రీరామ్, గారపాటి చౌదరి తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో శ్రీ బాల అయ్యప్ప కోలాట భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గజ్జె పూజలో ఆయన, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బుడిపుల సుగుణరావు గురు స్వామి నేతృత్వంలో కోలాటం నేర్చుకున్న బృందం ప్రదర్శించిన కోలాట నృత్యం భక్తులను విశేషంగా అలరించింది. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోలాట బృందాల సభ్యులు ఐదువేల మందితో ఒక భారీ కోలాట ప్రదర్శన ఏలూరులో ఏర్పాటు చేయనున్నట్టు గారపాటి చౌదరి వెల్లడించారు.

ఆందోళన వద్దు.. ధాన్యమంతా కొంటాం

ఆర్డీఓ ఖాజావలి



భీమడోలులో ధాన్యం రాశుల వద్ద రైతుతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఖాజావలి



భీమడోలులో ధాన్యం లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ ఉషారాజకుమారి

భీమడోలు: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి అన్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో సోమవారం ఆయన భీమడోలులో పర్యటించారు. కళ్లాలు, ఖాళీ స్థలాల్లోఉన్న ధాన్యం రాసులు, బస్తాలను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులు పండించిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సమీపంలోని మిల్లులకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రైతులు ఎటువంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి, ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుందని తెలిపారు. ధాన్యం మిల్లులకు చేరే వరకు సిబ్బంది అన్ని విధాలుగా రైతులకు సహకరించాలని ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం ఇందిరాగాంధీ, సీఎస్‌డీటీ ఎ.మాధవరావు, ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి, వీఆర్వోలు వెజ్జు వినయ్‌కుమార్, మార్కేండేయులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: మిచాంగ్ తుఫాన్ కారణంగా రైతులు తాము పండించిన ధాన్యం గురించి ఎటువంటి అధైర్యం చెందవద్దని ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి చెప్పారు. కలెక్టరు ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు సోమవారం పెదపాడు మండలంలోని వట్లూరు, పెదపాడు గ్రామాల్లో ఆర్డీవో ఖాజావలి పర్యటించి ధాన్యం కొనుగోలు కళ్లాల్లో పంట పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పెదపాడు ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు అందుబాటులో ఉన్న వాహనాల వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. వట్లూరులో పంట పరిస్థితిని ఆయన పరిశీలించారు. రోడ్డుపక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని లారీలోకి ధాన్యం లోడింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, వ్యవసాయ అధికారి ప్రదీప్, పలువురు వీఆర్‌వోలు వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు. పెదపాడులో కళ్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలను తహసీల్దార్ విజయకుమార్‌రాజు లారీల్లో ధాన్యం బస్తాలను లోడింగ్ చేసి మిల్లులకు తరలించారు.

సార్వా పంటకు తుఫాన్ గండం

గణపవరం: తుఫాను వల్ల సార్వా పంట నీటిపాలు కాకుండా రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఇప్పటికే మాసూళ్లు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పొలాలు, పుంతలు, దిబ్బలపై ఉంచిన ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టారు. రాసులమీద ప్లాస్టిక్ బరకాలు, టార్పాలిన్‌లు, గడ్డి రక్షణగా కప్పారు. పొలాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం రాసుల్లోకి నీరు వెళ్లకుండా చుట్టూ గడి తవ్వి నీరు బయటకు వెళ్లేలా మార్గాలు చేశారు. సోమవారం రోజంతా కురిసిన వర్షం, ఈదురు గాలులకు చాలా చోట్ల కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలపై పడిపోయింది. కొన్నిచోట్ల కోసిన వరి పనలను కట్టలుకట్టి, ఒక చోటికి చేర్చి తడవకుండా బరకాలు కప్పారు. తుఫాన్ ప్రభావం మంగళవారం కూడా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. రెండు, మూడు రోజుల పాటు వరి కోతలు కోయవద్దని, ధాన్యం రాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. మండలంలో 12 వేల ఎకరాల్లో సార్వాసాగు చేయగా, ఇప్పటివరకు ఆరు వేల ఎకరాల్లో వరి కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఆరువేల ఎకరాలలో తుఫాన్ కారణంగా వరికోతలు నిలిపివేశారు.



దాన్యం రాశి తడవకుండా చుట్టూ ఏర్పాటు చేసిన మార్గం

ఆందోళన చెందవద్దు

భీమడోలు: తుఫాన్ వర్షాలకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఏ పి.ఉషారాజ కుమారి అన్నారు. ధాన్యం తడిసిపోకుండా లారీల్లో లోడుచేసే ప్రక్రియను సోమవారం మండల వ్యవసాయధికారిణి ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి ఆమె పరిశీలించారు. భీమడోలులో లారీల్లోకి ధాన్యం బస్తాలను లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సమీపంలోని మిల్లులకు ధాన్యాన్ని రైతులు తరలించుకోవచ్చన్నారు. తేమ శాతం నిబంధనలు ప్రభుత్వం సడలించిందని, నిబంధనల మేరకు 17 నుంచి 20 తేమ శాతం ఉన్నా రైతుల నుంచి మిల్లర్లు కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ఇప్పటికే రాసులపై ఉన్న ధాన్యాన్ని రైతులు రక్షించుకోవాలని, గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచామని తెలిపారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు మండలంలోని 10,200 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా వాటిలో 13,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఉంగుటూరులో 32,631 మెట్రిక్ టన్నులు, నిడమర్రులో 5261 మెట్రిక్ టన్నులు, ద్వారకాతిరుమల 3364 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరిందని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెదపాడు: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులతో సెలవులు నిలుపుదల చేస్తూ ఆదేశాల జారీ చేశామన్నారు. డీపీఓ కార్యాలయం సేవలు పొందేందుకు ఫోన్ నెంబర్ 98499 03321లో సంప్రదించాలని తెలిపారు.

రైతన్నలకు అండగా ప్రభుత్వం



అబ్బయ్యచౌదరి

దెందులూరు: ధాన్యం కొనుగోలు గురించి రైతన్నలు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధాన్యంలో తేమ శాతాన్ని చూడకుండా రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుభరోసా కేంద్రాలు, ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం బస్తాల రవాణా, హమాలీ ఖర్చులు ప్రభుత్వం భరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, రెవెన్యూ, వ్యవసాయశాఖ, పంచాయితీ రాజ్‌శాఖ ఉద్యోగులు ధాన్యం కొనుగోలు విషయంలో సహకరించి రైతన్నలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సూచించారు.

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

భీమడోలు: మండలంలో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని వైఎస్సార్ సీపీ భీమడోలు మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు. భీమడోలు పంచాయతీ ఆవరణంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయం -1, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రాలను ఉదయం 9.30 గంటలకు వాసుబాబు ప్రారంభిస్తారన్నారు. 11 గంటలకు ఆగడాలలంకలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్లను వాసుబాబు ప్రారంభిస్తారని తెలిపారు. సూరప్పగూడెంలో సాయంత్రం 4 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు.

గ్రామ సచివాలయం.. మహాత్ముడి కలల రూపం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



నిడమర్రు గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: జాతిపిత మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావాలన్న తపనతోనే గ్రామ సచివాలయ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంకురార్పణ చేశారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం నిడమర్రు గ్రామంలో రూ.43 లక్షలు వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించి మాట్లాడారు. కేవలం నాలుగు నెలల్లో నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చి గ్రామ సచివాలయ వ్యస్థను బలోపేతం చేశామన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు చేరువలో ఉండే ప్రజా సేవకులని తెలిపారు. పరిపాలనలో అవినీతి, వివక్షకు తావులేకుండా చేయడానికే ఈ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని చెప్పారు. ప్రతి సచివాలయంలో 35 శాఖలకు సంబంధించిన 500 సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లీనిక్స్, రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, జిల్లా వ్యవసాయ కమిటీ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్‌లు పొట్నూరి ఉమా, ముగ్గళ్ల యాకోబు, ఉప సర్పంచ్ పోలిశెట్టి మురళి, ఎంపీటీసీ దూసనపూడి సత్యానారాయణ, మండల ఆర్‌బీకే చైర్మన్ పోలిశెట్టి రమేష్, పార్టీ అధ్యక్షుడు గుడిసే జాన్‌బాబు, పేరిచర్ల రాంబాబు, కన్నాజి బాలాజీ, అంబటి సంజీవరావు, చలంశెట్టి బాబులు, అంబళ్ల శ్రీను, పతివాడ శ్రీను, వెంకటేష్, సనపతి శ్రీను, దూలం దాత్రిరావు ఉన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాముల పయనం



భీమడోలులో ఇరుముడులధారణ కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

భీమడోలు: భీమడోలులో సోమవారం అయ్యప్ప స్వాముల ఇరుముడులధారణ వేడుక ఘనంగా జరిగింది. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో పరిసర గ్రామాలకు చెందిన 80 మంది మాలధారులు మండల దీక్షను పూర్తి చేసుకుని అయ్యప్ప స్వామి పీఠం వద్ద ఇరుముడులు ధరించారు. శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అర్చకుడు మధు పవన్ నేతృత్వంలో గణపతి పూజ, ఇరుముడుల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాలధారులు కుటుంబ సభ్యులతో పీఠం వద్ద కొచ్చి పూజల్లో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. వందలాది మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సీజన్‌లో 200 మంది మాలధారులు శబరిమలై వెళ్లారని శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు, మాలధారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షబిల్వార్చన



సీతంపేటలో పార్వతి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో లక్షబిల్వార్చన మహోత్సవం

దెందులూరు: సీతంపేటలోని పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష బిల్వార్చన మహోత్సవం నిర్వహించారు. తొలుత ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, త్రిశూల పూజ, మహాన్యాస పూర్వక పంచామృత, నవరస ఫల రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, పార్వతీదేవికి కుంకుమార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, నీరాజన మంత్ర పుష్పాలు, సహస్ర దీపాలంకరణ సేవ, దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత కనకరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), నాయకులు కోటిపల్లి సత్తిరాజు, పరసా గణేష్, వర్రె సత్తిబాబు, వలివల ఉదయ్‌భాస్కర్ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కొఠారు రామచంద్రరావును సత్కరించారు. లక్షబిల్వార్చన మహోత్సవంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత అని, అన్ని గ్రామాల్లో మైక్రో వాటర్ ఫిల్టర్స్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం జల్లికొమ్మరలో రూ.45 లక్షలతో నిర్మించిన వాటర్‌ట్యాంకు, మైక్రోఫిల్టర్స్, సంపులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డెల్టా ప్రాంతంలో ఆక్వారంగం విస్తరణ వల్ల పంట కాలువలు, మంచినీటి వనరులు కాలుష్యంబారిన పడ్డాయని, ఈ నేపథ్యంలో గోదావరి జలాలను నేరుగా పైపులైను ద్వారా గ్రామాలకు అందించే వాటర్ గ్రిడ్ పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిందని వివరించారు. ప్రతి గ్రామంలోనూ వాటర్‌ట్యాంకు, పైపులైన్ల విస్తరణ, శివారు ప్రాంతాలకు మంచినీటి సరఫరా, మైక్రోవాటర్ ఫిల్టర్ల ఏర్పాటు పనులను జల్‌జీవన్ మిషన్ పథకంలో చేపట్టామన్నారు. అన్ని గ్రామాల్లో ఫిల్టర్స్ వినియోగంలోకి తీసుకొచ్చి, ప్రజలకు ఫిల్టర్ వాటర్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను వాసుబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు బుద్దాల వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కురెళ్ల త్రిమూర్తులు, నాయకులు మద్దాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



భీమడోలులో కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

భీమడోలు: ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనది, విలువైందని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నా రు. భీమడోలులోని రత్న, మాధురి కళాశాలలో యువతీ యువకులకు సోమవారం ఓటు హక్కు నమోదు, వినియోగంపై ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షత అవగాన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిలుగా ఎంపీడీఓ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీలు పాల్గొని ఓటు హక్కు, వినియోగంపై అవగాహన కల్పించారు. వచ్చే జనవరికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ఓటు ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. ఈనెల 9వ తేదీలోగా కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతులకు అందుబాటులో అధికారులు

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, మండలంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో మూడు రోజుల పాటు మండల గ్రామ స్థాయి ఉద్యోగుల సెలవులు ఉండబోవని ఆదేశాలు ఇచ్చారు. గ్రామాలువారీగా విధి నిర్వహణ కేటాయించారు. తహసీల్దార్, వ్యవసాయశాఖ ఏఓ నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పర్యవేక్షించారు. మిల్లర్లను ప్రభుత్వ నిబంధనలు వివరించి కొనుగోలుకు ప్రోత్సహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా రైతులు ధాన్యాన్ని పొలాల నుంచి బయటకు తీసుకురావడం, టార్పాలిన్‌తో కప్పడం, కొన్ని చోట్ల కుప్పలు వేసుకున్నారు. ఇంకా మండలంలో 200 ఎకరాల్లో వరి కోతలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. మండల కేంద్రంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు వారి పనిచేసే స్థానాలను వదిలి ఈ రెండు రోజులు బయటకు వెళ్లరాదని వివరించారు.

మళ్లీ జగన్ వస్తేనే పేదలకు మేలు



పిప్పరలో పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నేతలు

గణపవరం: రాష్ట్రంలో నిరుపేదలకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా రావాలని వైఎస్సార్ సీపీ గణపవరం మండల కన్వీనర్ దండు రాము అన్నారు. సోమవారం గణపవరం మండలం పిప్పరలో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా ఎందుకు రావాలి కార్యక్రమం నిర్వహించారు. కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను విజయవంతంగా ఐదేళ్ల అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని రాము చెప్పారు. మండల సచివాలయాల కన్వీనర్ మద్దాల రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌ను మళ్లీ గెలిపిస్తే మెరుగైన పథకాలను తీసుకొస్తారన్నారు. అభివృద్ధికి సమాంతరంగా సంక్షేమాన్ని నిర్వహించిన ఘనత జగన్‌దేనన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి ఐదేళ్లలో మంజూరు చేసిన పథకాలు, నిధుల వివరాలతోకూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర బేబీ, వైస్ ఎంపీపీ నీతిపూడి వీరమ్మ, పార్టీ నాయకులు కాకర శ్యాంసన్, సర్పంచ్‌లు కురెళ్ల వెంకటరత్నం, కర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమమే లక్ష్యం



విద్యార్థులకు ట్యాబ్స్, ప్రశంసా పత్రాలను అందించిన ఏఎంసీ చైర్‌పర్సన్ నీలిమ జూనియర్, ఎంఈఓలు



కొవ్వలి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం విభిన్నప్రతిభావంతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్ అన్నారు. భీమడోలు భవిత కేంద్రం వద్ద సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని విలీన విద్య ఉపాధ్యాయులు సీహెచ్ వెంకట దుర్గ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ హాజరై మాట్లాడారు. దివ్యాంగుల్లో అసమాన ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అందిస్తూ ఆదుకుంటుందని చెప్పారు. వారికిచ్చే పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్స్‌లను అందించిందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ట్యాబ్స్, ప్రశంసా పత్రాలను అందించారు. 2008-09 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ప్రతినిధి వీరబాబు వారికి బహుమతులు ప్రదానం చేశారు. నీలిమజూనియర్ చిన్నారులకు సహపంక్తి భోజనలు ఏర్పాటు చేశారు. తొలుత దివ్యాంగులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో తమ ప్రతిభను చాటారు. కాంప్లెక్స్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ప్రత్యేక విద్య టీచర్ అక్బర్ ఉన్నీసా వలి, భవిత టీచర్లు రత్నకుమారి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చిత్రలేఖన పోటీలు

దెందులూరు: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారులు ఎవీఎన్‌వీ ప్రసాద్, కే.అన్నమ్మ అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎల్‌ఎన్‌వీ శర్మ, సాల్వేషన్ ఆర్మీ హెచ్‌ఎం దాసు ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు హేమలతా, శ్రీదేవి పర్యవేక్షణలో దివ్యాంగులకు పోటీల్లో చిత్రలేఖనం, ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓలు బహుమతులు అందజేశారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 9,10 తేదీల్లో ఏలూరులో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. ఏలూరు ఆర్‌ఆర్‌పేట సర్వీస్ రిజర్వాయర్-2 వద్ద మస్టర్ టైంలో ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



పిట్టా బాబు

భీమడోలు: రోడ్డుపై ఉన్న ధాన్యం గుట్టలను ఢీకొట్టిన ఓ మోటార్ సైకిలిస్ట్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదనిండ్రకొలను గ్రామానికి చెందిన పిట్టా బాబు (31) అనే యువకుడు గత నెల 30న తన బైక్‌పై ఏలూరు నుంచి ద్వారకాతిరుమల వెళుతూ జాతీయ రహదారిపై పోలసానిపల్లి సమీపంలో ద్వారకాతిరుమల వెళ్లే మలుపు వద్ద రోడ్డుపై ధాన్యం రాసిని ఢీకొని అదుపు తప్పి పడిపోయాడు. దీనిని గమనించిన విజయవాడ వెళ్తున్న భక్తులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో బాబుని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి బాబు మృతి చెందినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు. రోడ్డుపై ధాన్యం రాసి చేసి ప్రమాదానికి కారణమైన యాజమాని కె.నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఏలూరు ఆర్టీసీ డిపో పరిధిలో చింతలపూడి, భీమవరం, ద్వారకాతిరుమల రూట్లలో గత నెల 15 నుంచి 30వ తేదీ మధ్య ప్రయాణించిన వారి టిక్కెట్లతో లక్కీడిప్ సోమవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండులో నిర్వహించారు. బ్రహ్మనాయుడు, రాములు, కుమారస్వామి, శాంతి, శేషజ్యోతి, రాజు, సలోమి, మాత్రేశ్వరి, ప్రశాంతి, సాయి విజయ, సోమరాజు, పాండు విజేతలుగా నిలిచారు. వీరికి ఏలూరు ఆర్‌ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ సంస్థ సౌజన్యంతో బహుమతులు అందించామని డిపో మేనేజర్ బి.వాణి తెలిపారు.